# నామకరణం

**అ**దో కలవారి ఇల్లు అక్కడ నామకరణ మహోత్సవం జరుగుతోంది. ఇంటివారూ వచ్చిన బంధుమిత్రులూ కూడా మంచి వస్త్రాలూ నగలూ ధరించి దర్జాగా ఉన్నారు.

ఘనంగా కాఫీ టిఫిన్లు ఆరగించారందరూ నామకరణం కార్యక్రమం పొద్దున ఎనిమిది గంటలకే మొదలయింది. పూజాపునస్కారా చకచకా జరిగిపోయాయి. పేరుపెట్టే దగ్గరకు వచ్చే సరికి బ్రేకుపడింది.

గంట అయింది. రెండు గంటలు అయింది. అయినా వ్యవహారం ఓ కొలిక్కి రాలేదు. అందరూ కల్పించుకుంటున్నారు. తమకు తోచిన సలహాలు చెప్తున్నారు. అయినా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉంది వ్యవహారం.

''బాబూ త్వరగా కానివ్వండి ఆలస్యం అయిపోతుంది. నాకింకా చాలా కార్యక్రమాలు ఉన్నాయి'' అని తొందరపెడుతున్నాడు ఇంటి పురోహితుడు పరమేశ్వర శాస్త్రి.

"అయితే అయింది లేవయ్యా నీక్కావాలంటే ఇంకా నాలుగు డాలర్లు ఎక్కువ ఇస్తాంలే" అంది కామేశ్వరమ్మ. ఆవిడ పిల్లకి తాతమ్మ ఆవిడ ఇంట్లోనే ఈ నామకరణం జరుగుతోంది.

అదేంమాట పెద్దమ్మగారూ ఇవ్వాళ వచ్చే డాలర్లకు ఆశపడితే అయిపోయిందా? ఈ ఊళ్ళో ఉండాల్సిన వాడిని. నామాట మీద నిలబడాలిగా. అవతల పెద్దవారింట్లో పెళ్ళికి ఒప్పుకున్నాను అటూ ఇటూ అయితే నన్నొదిలిపెడతారా! బుర్ర రామకీర్తన పాడిస్తారు లబలబలాడాడు శాస్త్రి.

అదేసమయంలో అక్కడికి వచ్చాడు కేటరింగ్ వారి హెడ్ కుక్ "అమ్మావంట అయిపోయింది, మీరు ఊ అంటే పూరీలు వేయించేస్తాం" అన్నాడు.

“ఇంకాస్త ఆగు నాయనా. ఇంకా చాలా తతంగం ఉంది. ఇప్పటినించే వేయించేస్తే చల్లారిపోతాయి” అంది నామకరణం పెళ్ళికూతురి అమ్మమ్మ సావిత్రి.

“అబ్బ ఇంకెంతసేపు కబుర్లన్నీ చెప్పేసుకున్న బంధువులు సణుక్కుంటున్నారు. ‘అబ్బరంగా బిడ్డ పుట్టింది గడ్డపార తీసుకురా చెవులు కుడతాను’ అన్నాడుట వెనకటికి ఎవడో విచిత్రం కాకపోతే పిల్లకి పెట్టడానికి పేరే దొరక లేదా వాళ్ళకి” అని ఎద్దేవా చేసింది ఓ ఇల్లాలు.

పసిపిల్ల నిద్రపోతోంది నిశ్చింతగా. ఆ పాప తల్లిదండ్రులు మాత్రం బుర్ర వేడెక్కిపోయేలా ఆలోచిస్తున్నారు. ఇవ్వాళే కాదు చాలా రోజులుగా ఇలాగే ఆలోచిస్తున్నారు.

వెంకటేశ్వర్రావు సుబ్బలక్ష్మి దంపతులు ఇద్దరూ చాలా తెలివైన వాళ్ళు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. వెంకటేశ్వర్రావు ఆర్నెల్లు అమెరికాలో, ఆర్నెల్లు ఇండియాలో ఉంటాడు. లక్ష్మి ఇండియాకీ సింగపూర్‌కీ తిరుగుతూ ఉంటుంది.

ముందర చదువులతోనూ ఆ తరవాత ఉద్యోగాలతోనూ ఊపిరి సలప కుండా గడిపేసిన ఆ దంపతులకు పెళ్ళైన ఆరేళ్ళకి పిల్లల మీద ధ్యాస మళ్ళింది. పిల్లలు కావాలని నిర్ణయించుకున్నారు. ఆర్నెల్లు గడిచినా ఏ సూచనా కనిపించక పోయేసరికి కంగారు పడిపోయారు.

ఏదైనా మంచి సంతాన సాఫల్యకేంద్రం డాక్టరుని సంప్రదించాలనుకున్నారు. సాఫల్యకేంద్రం అఖ్ఖర్లేదు వైఫల్యకేంద్రం అఖ్ఖర్లేదు. మీరిద్దరూ ఓ నెల్లాళ్ళ పాటు ఒక దగ్గర అఘోరించండి అని మందలించింది వేంకటేశ్వరరావు తల్లి. నాలిక్కరుచుకున్నారు కంప్యూటరు దంపతులు. పెద్దావిడ సలహా పనిచేసింది. లక్ష్మికి నెల తప్పింది. ఆడపిల్ల పుట్టింది.

ముప్ఫై అయిదేళ్ళు దాటిన ఆ దంపతులు కూతుర్ని చూసుకుని మురిసి పోయారు. కూతురికి అపురూపమైన పేరు పెట్టాలని నిశ్చయించుకున్నారు.

అందుకు కారణం ఉంది. వాళ్ళిద్దరికీ తమ పేరంటే తగని ఎలర్జీ. పది మందికి ఆరుగురు వెంకటేశ్వర్రావులు. అయిదుగురు సుబ్బలక్ష్మిలు టెలిఫోన్ డైరెక్టరీలో పేరు వెతుక్కోవాలన్నా తలనొప్పే రిజర్వేషను చార్టులో పేరు చూసుకోవాలన్నా తలనొప్పే.

మల్లాది రాసిన పిల్లల పేర్ల పుస్తకం మొదలుకొని మేనకాగాంధీ రాసిన పేర్ల పుస్తకం దాకా అరడజను పుస్తకాలు కొన్నారు. ఏ పేరూ నచ్చలేదు. నచ్చిన పేరు అప్పటికే ఎవరో ఒకరు పెట్టేసుకున్నారు.

సుబ్బలక్ష్మి కడుపుతో ఉన్నప్పటి నించి ఏరి తూర్పార పడుతున్నా పిల్ల పుట్టి నామకరణం దాకా వచ్చినా, పేరుమాత్రం దొరకలేదు.

వెంకటేశ్వర్రావు తల్లీ పెత్తల్లులూ వగైరా ఆడవాళ్ళంతా ఓ మూల జేరి లలితా సహస్రనామాలూ లక్ష్మీసహస్రనామాలూ చదువుతున్నారు. తమకు నచ్చిన నామం కనిపించగానే "ఏరా వెంకన్నా ఈ పేరెలా ఉందో చూడు నాయనా!" అని చెప్తు న్నారు.

"ప్చ్" అని పెదవి విరుస్తున్నాడు వెంకటేశ్వర్రావు.

మరోమూల తలపండిన మగ వాళ్ళందరూ చేరి ప్రభవాది సంవత్సర నామాలూ, అశ్వని, భరణి మొదలగు నక్షత్రాల పేర్లూ ఏమైనా పనికొస్తాయేమో చూస్తున్నారు.

ఫలితం శూన్యం.

అందరికీ నీరసాలు వస్తున్నాయి పరమేశ్వర శాస్త్రి టెన్షన్ పడిపోతున్నాడు.

హాఫ్‌డే సెలవు పెట్టొచ్చిన వాళ్లందరూ లోపలికెళ్ళి, ఏదో కాస్త నోట్లో వేసుకుని 'ఈ బహుమతి ఇవ్వండి' అని తెలిసినవాళ్ళకు అప్పజెప్పి, జారుకుంటున్నారు.

హఠాత్తుగా మోగింది సుబ్బలక్ష్మి సెల్‌ఫోన్. నీరసంగా రిసీవ్ చేసుకున్న సుబ్బలక్ష్మి ఆ కంఠం వినగానే ఎగిరి గంతేసింది. నువ్వు ఉన్నపాటున ఇక్కడికి వచ్చేయ్ అంది. ఇదిగో వస్తున్నా అంది అవతలి శాల్తీ.

"వెంకీ. వెంకీ, మన కందిపప్పు వస్తోంది" అంది మహోత్సాహంతో. "ఏవిటీ కందిపప్పు వస్తోందా! అన్నాడు వెంకటేశ్వర్రావు సంభ్రమాశ్చర్యాలతో.

"అవును ఏదో పనుండి వచ్చిందిట నన్ను విష్ చేయాలని ఫోన్ చేసింది. ఇదీ విషయం అర్జెంటుగా రమ్మంటే ఇదుగో వస్తున్నా అంది" అని చెప్పింది మొహం ఇంత చేసుకుని.

"వియ్ ఆర్ రియల్లీ లక్కీ మనం ఇలా పాపాయి పేరుకోసం కొట్టుకుంటూ ఉంటే కందిపప్పు రావడం చాలా అదృష్టం" అన్నాడు.

"ఈ లక్ మనది కాదు. మన పాపాయిది" అంది లక్ష్మి

ఆ వస్తున్న వ్యక్తి ఎంత గొప్పదో వివరించసాగింది, అందరికీ. అటుగా వెళ్ళున్న కామేశ్వరమ్మని పిల్చాడు ఆవిడ భర్త రమణయ్య.

"ఏవిటాలస్యం? ఇంకాపేరు దొరకలేదూ! అపరాహ్ణం అవుతోంది" అన్నాడు చిరాగ్గా.

"వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది కందిపప్పు రావాలిట రాగానే" అంటూ చెప్పబోయింది.

"ఏవిటీ కందిపప్పు రావాలా? ముందే సరుకులన్నీ తెప్పించు కోరూ? ఆఖరి క్షణంలో కందిపప్పు రావాలంటావేం?" విసుక్కున్నాడాయన.

"ఏడిసినట్టుంది ఆ కందిపప్పు కావలసినంత ఉంది. ఇప్పుడు రావాల్సిన కందిపప్పు మన సుబ్బలక్ష్మి ఫ్రెండు" వివరించిందామె.

"సంధి ప్రేలాపనా నువ్వూనూ అయినా నిన్నని లాభం ఏ వుందిలే? షుగరు పేషంటువి. వేళ తప్పింది ఇలా అయోమయాన పడ్డావంటే వింతేం ఉంది? వెళ్లి ఏదైనా తిను" అన్నాడాయన జాలిగా

"ప్రేలాపన కాదు. నిజమే మన సుబ్బులు ఫ్రెండ్ పేరు కందిపప్పుట" మరోసారి చెప్పింది ఆవిడ. మనిషి పేరు కందిపప్పు ఏమిటి చెప్మా అనుకున్నాడాయన.

ఆ సందేహం ఆయనకే కాదు. ఇంకా చాలామందికి వచ్చింది. సుబ్బలక్ష్మినే అడిగారు. హాల్లో, అలా అడిగిన అందరికీ సమాధానం చెప్తోంది సుబ్బలక్ష్మి.

కందిపప్పు అసలు పేరు కనకమహాలక్ష్మి. స్కూల్లో చేరాక ఆ పేరు మరీ పొడుగ్గా ఉందని కనకగా మార్చుకుంది. అందరూ అదే పేరుతో పిలిచేవాళ్ళు. చదువూ సంధ్యా పూర్తయ్యాక పప్పు దినకరరావుతో పెళ్లయింది కనకకి. కనకా అని పిలవడానికి బద్ధకం వేసి కన్ అని పిలిచే వాడు దినకర్. భర్తని ముద్దుగా దినం అని పిల్చేది. అమెరికా వెళ్ళాక కనకా దినకర్ పప్పు కాస్తా కన్‌ది పప్పుగా మారిపోయింది ఆ తరువాత కందిపప్పు అయిపోయింది. ఆఫీసులో అందరూ కందిపప్పనే పిలుస్తారు. అమెరికాలోని ఇతర ఇండియన్ ఫ్రెండ్స్ కూడా కందిపప్పనే అంటారు.

కందిపప్పు తెలివి తేటలు అమోఘం. ఆ అమ్మాయి బుర్ర పాదరసం. ముఖ్యంగా పేర్లు పెట్టడంలో ఆవిడకి ఆవిడే సాటి. ఆవిడకు తెలిసిన దంపతులు ఉమాకాంత్, ఉషలకు ఆడపిల్ల పుట్టినప్పుడు ఆ పిల్లకి 'ఉ'తో మొదలయ్యే కొత్తపేరు కావాలని

ఆశపడుతున్న సమయంలో వెళ్ళి పాపాయికి ఉద్దరిణి అని పేరు సూచించిన ఘనత కందిపప్పుదే.

మరలాంటి గొప్ప వ్యక్తి ఇటువంటి క్లిష్టసమయంలో వస్తోందంటే వెంకికీ సుబ్బులుకీ ఆనందం కాదా? వస్తే పేరు పెట్టేస్తుందని సుబ్బలక్ష్మి వెంకటేశ్వర్రావు, ఈ కార్యక్రమం త్వరగా అయితే అవతల పనులు చేసుకోవచ్చని పరమేశ్వర శాస్త్రి, ఎప్పుడెప్పుడు ఇంత తినేసి ఇళ్లకి వెళ్దామా అని అనుకుంటున్న బంధువులు, అందరూ కందిపప్పు కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నారు.

కాసేపట్లో వచ్చేసింది కందిపప్పు. ఉండాల్సినదానికన్నా కాస్త బిగుతుగా ఉన్న జీన్స్‌పేంటూ, బాగా వదులుగా ఉన్న టీషర్టూ వేసుకుంది.

ఏణ్ణర్థం వయసున్న పిల్లాడిని కోతి పిల్లలా కడుపు కానించుకునే సంచిలో కూర్చోబెట్టుకుని వీపుకి బెల్టు కట్టేసుకుంది.

రాగానే నవ్వుతూ అందరినీ పలకరించింది. వెంకినీ, లచ్చునీ చిన్న పాపాయినీ అమాంతం కావలించుకుంది. "లవ్లీ బేబీ" అంది పాపాయి బుగ్గలు నిమిరి.

కందిపప్పుకి కాఫీ ఇచ్చింది కామేశ్వరమ్మ. "అబ్బాయి పేరేమిటమ్మా?" అని అడిగింది పసివాడి బుగ్గలు నిమురుతూ.

"కుంక" అని చెప్పింది కందిపప్పు. "కుర్రకుంక అని ముద్దుగా అంటాంలే అమ్మా అసలు పేరు ఏమిటి ?" అన్నాడు రమణయ్య.

"వాడి అసలు పేరే కుంక తాతయ్య గారూ" అంది కంది పప్పు.

"అదేం పేరమ్మా ఎక్కడా వినలేదే!" అంది వెంకీ తల్లి.

"మరదే కందిపప్పు స్పెషాలిటీ!" అన్నాడు వెంకీ.

గర్వంగా నవ్వింది కందిపప్పు. "నాకు అనిల్ కుంబ్లే అంటే ప్రాణం. దినం కపిల్‌దేవ్ అంటే పడి చచ్చిపోతాడు. వాళ్ళిద్దరి పేర్లూ కలిసివచ్చేలా కుంకా అని పెట్టేశాం" అంది.

అందరూ వెర్రి మొహాలు వేశారు.

వెంకీ సుబ్బులూ గర్వంగా చూశారు.

"మా పాపాయికి మంచిపేరు పెట్టాలి" అంది సుబ్బలక్ష్మీ .

"ఓస్ దానికేం భాగ్యం నువ్వొందాక చెప్పావు కదా దార్లో ఆలోచించి మంచి పేరు ఆలోచించాను. యునిక్ నేమ్" అంది కందిపప్పు.

ఏంటది? అడిగింది సుబ్బులు చెవిలో చెప్పింది కందిపప్పు.

యురేకా అని అరిచింది సుబ్బులు భర్త చెవిలో ఊదింది.

అతని మొహం చింకి చేటంత అయింది.

పేరు దొరికింది అందరికీ తెలిసింది. కలకలం చెలరేగింది. ఆమూలా ఈమూలా చేరి కునికిపాట్లు పడుతున్న వాళ్లందరూ అక్కడికి వచ్చేశారు.

పరమేశ్వర శాస్త్రి ప్రాణం లేచి వచ్చింది.

"ఆ! రండి నాయనా ! అమ్మా ఆ దీపారాధనలో కాస్త నూనె వెయ్యండి" అంటూ హడావిడి పడిపోయాడు.

దంపతులు పీటలమీద కూర్చున్నారు. పసిబిడ్డని సుబ్బులుకి అందించారు.

బియ్యం పళ్ళెం వెంకటేశ్వర్రావు చేతి కందించాడు శాస్త్రి మంత్రాలు చదువుతూ ఉంగరం కూడా అందించి.

"ఇక రాయి నాయనా!"

"నాకు తెలుగురాదు కదండీ!" అన్నాడు వెంకటేశ్వర్రావు వెర్రి మొహం వేసి.

"వచ్చిన భాషలో రాయి ఏ భాషా రాకపోతే పిచ్చిగీతలు గియ్యి" అన్నాడు విసుగెత్తి పోయిన శాస్త్రి అందరూ గొల్లున నవ్వేశారు.

"సరే కానీ! రాయి మాసనామా మాసనామం ఏం పెడదాం గౌరీ అని రాయి" అన్నారు శాస్త్రి.

రాశాడు వెంకి.

"తరువాత నక్షత్ర నామం టాటీటో టం అనే అక్షరాలతో రావాలి కదూ టిక్కీ అందాం రాసెయ్ వెంకీ" అన్నారు శాస్త్రి.

రాసేశాడు వెంకీ.

"ఇక వ్యావహారిక నామం నువ్వు పెట్టాల్సిన పేరు రాసేయ్."

రాసేశాడు వెంకీ.

"పాప కుడి చెవిలో అ పేరు చెప్పు అందరూ అక్షింతలు తీసుకోండి" అన్నారు శాస్త్రి అందరికీ అక్షింతలు ఇస్తూ.

"ఆ ఇక చెప్పు నాయనా నీ కూతురి పేరేమిటి?" అడిగాడు శాస్త్రి.

అందరూ కూతూహలంగా చూస్తున్నారు.

"మధుమేహ" గర్వంగా చెప్పేశారు వెంకీ.

ఒక్కక్షణం నిశ్శబ్దం.

శాస్త్రి ముందు తేరుకున్నాడు.

"శబాష్ బావుంది నాయనా! గౌరీ టిక్కీ మధుమేహ నామ్నీ దీర్ఘాయుష్మావతీ భవ. శతమానం భవతు" అని ఆశీర్వదించి నామకరణ కార్యక్రమం ముగించాడు శాస్త్రి.

అందరూ అక్షింతలు జల్లి అశీర్వదించి భోజనాలకు వెళ్ళిపోయి అక్కడ గుసగుసలాడుకున్నారు.

"ఏం పేర్లో ఎం గోలో ఆ మధ్య ఓ పిల్లకి రుద్రాక్ష అని పేరుపెట్టారు" అన్నాడొకాయన.

"ఏం చేస్తాం మరి కొత్తదనం కావాలంటే ఇంతే మరి" అన్నాడు ఇంకో పెద్దమనిషి.

రమణయ్య బఫే తినలేడు. అందుకే ఆయనకి విడిగా వడ్డించింది. "ఇదేం పేరండీ. ఇంతాచేసి బిడ్డకి జబ్బు పేరు పెట్టారేమిటి?" అంది దీనంగా.

"ఏంచేస్తాం? ఆ కందిపప్పు సెలక్షను. పూర్తి పేరెలాగు పిలవరుగా మధూ అని ఇంకా బద్ధకం అయితే మేహ్ అనే పిలుస్తారు" ఓదార్చాడాయన.

అంతేలెండి మనం ఏవైనా అంటే సుబ్బులుకి కోపం వస్తుంది. దానికి కోపం వచ్చిందంటే దాని మొగుడికి అలకవస్తుంది అంది కామేశ్వరమ్మ

"అవునవును కందకిలేని దురద కత్తిపీటకి ఎందుకు అన్నట్లు ఆ పేరుపెట్టి వాళ్ళంతా ఆనందపడుతుంటే మనకెందుకు బాధ? మనం కావాలని మనింట్లో శుభకార్యం ఏర్పాటు చేసినందుకు అంతా సవ్యంగా జరిగింది. అదే పది వేలు" అన్నాడాయన.

*ఈనాడు ఆదివారం, 27 ఏప్రిల్ 2003*